## ట్రాఫిక్ విధుల్లో మున్సిపల్ చైర్మన్ !



ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 2: మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావు ఉప్పలయ్య బుధవారం ఉదయం కాసేపు ట్రాఫిక్ పోలీసు విధులు నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సందర్భంగా మార్కెట్ రోడ్‌లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య గమనించి అర్చనా టెక్స్ చౌరస్తాలో నిలబడి వాహనదారులకు ట్రాఫిక్ సూచనలు చేశారు. మున్సిపల్ చైర్మన్ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడాన్ని చూసి అక్కడున్న వ్యాపారులు, వాహనదారులు ఆశ్చర్యపోయారు.

## ఇట్లయితే బస్టాండులోకి వెళ్లేదెట్ల..?

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 2: మంచిర్యాల ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లాలంటే ప్రయాణికులు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ఇరుకుగా ఉండే ద్వారం, దారికి అడ్డంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల పార్కింగ్, పండ్లు, పూల దుకాణాలు మరో వైపు బుధవారం కురిసిన వానతో బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండులోకి వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండు లోపలికి వెళ్లే దారిలో మురుగునీరు, అడ్డంగా వాహనాలు



# యాసంగి వచ్చినా.. రైతు భరోసా రాలే!

**వానకాలం పంటల సాగు పూర్తవుతున్నా పెట్టుబడి సాయం అందించని కాంగ్రెస్ సర్కారు**

- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల రైతులపై రూ.592.11 కోట్ల భారం
- అప్పులు పాలవుతున్నామని అన్నదాతల ఆవేదన

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): వానాకాలం పంటల సాగు ముగిసి..యాసంగి పంటల సాగు ప్రారంభమవుతున్నా రైతు భరోసా పెట్టుబడి సాయం అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు పంటలకు కలిపి ఏడాదికి ఎకరానికి రూ.15000 చొప్పున రైతు భరోసా సాయం ఇస్తామని రైతులను నమ్మించి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ చివరికి మొండి చేయి చూపించింది. రైతు భరోసా అటుంచి కనీసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా ఎకరానికి రూ.5 వేలు అయినా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి నెలకొన్నది. మొక్కజొన్న, తదితర పంటలు కోసిన వారు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. యాసంగి సాగుకు కూడా పెట్టుబడి సాయం అందకపోవడంతో మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వంలో అప్పులు లేని వ్యవసాయం..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2018 నుంచి 2023 సంవత్సరం వరకు కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలోని 1,37,763 మంది రైతులకు రూ.2056.64 కోట్లను అందించింది. గతేడాది 1,38,588 మంది రైతులు ఉండగా 1,31,763 మందికి రూ.420 కోట్లను రెండు పంటలకు కలిపి రూ.10వేల చొప్పున రైతుబంధు సాయం అందించింది. మంచిర్యాల జిల్లాలో 2018 నుంచి 2023 సంవత్సరం వరకు రూ.1900 కోట్లు రైతు బంధు పథకం ద్వారా అందించింది. గతేడాది 1,56,357 మంది రైతులకు రెండు పంటలకు కలిపి రూ.10 వేల చొప్పున రూ.172.11 కోట్ల రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం అందించింది. దీంతో పంట సాగుకు ముందే పెట్టుబడికి రైతు బంధు సాయం అందడంతో రైతులకు అప్పులు చేసే తిప్పలు తప్పాయి.

### అప్పుల పాలవుతున్న రైతన్నలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా మారిపోయింది. వానకాలం పంట సాగు సమయంలో పెట్టుబడి సాయం అందించలేదని, యాసంగిలో కూడా రైతు బంధు ఊసెత్తడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. దీంతో రెండు పంటలకు కలిసి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతులపై రూ.420 కోట్లు, మంచిర్యాల జిల్లాలోని రైతులపై రూ.172.11 కోట్ల ఆర్థిక భారం పడింది. రైతులు అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధుకు మంగళం పాడినట్లే కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పుల పాలవుతున్నాం..



*పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. నాకు 4. 5 ఎకరాల భూమి ఉంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏడాదికి రూ.50 వేలు రైతు బంధు ద్వారా అందినయ్. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా పథకాన్ని అమలు చేయకపోవడంతో పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నాం. అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వస్తున్నది. కాంగ్రెస్‌ని నమ్మినందుకు నట్టేట ముంచింది.*

*-రౌతు సల్మయ్య, గిరివెల్లి, దహెగాం మండలం*

### కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచింది..



*నాకు 15 ఎకరాలు భూమి ఉంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాకు రైతు బంధు ద్వారా ఏడాదికి రెండు పంటలకు కలిపి లక్షా యాభై వేలు రైతు బంధు ద్వారా పెట్టుబడి సాయం అందేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వానాకాలంలో రైతు బంధు అమలు చేయలేదు. ఈ యాసంగిలోనూ అమలు చేయడం లేదు. దీంతో పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తున్నది.*

*- జర్పుల శంకర్, మరిపెల్లి గ్రామం దహెగాం*

# సింగరేణి బాంబులతోనే పేల్చివేత

- వీడియో విడుదల చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్
- సింగరేణి బాంబులు బయటకు ఎలా వచ్చినట్లు?
- కాంగ్రెస్ నేతలను కేస్ నుంచి తప్పించడం ఖాయం అయినట్లేనా?
- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చెన్నూర్ ప్రజానీకం





● శనగకుంట మత్తడి కథ

చెన్నూర్‌లో మూసి ఉన్న రిలయన్స్ మార్ట్, ట్రెండ్స్

మంచిర్యాల, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి బాంబులతోనే చెన్నూర్ శనగకుంట మత్తడిని పేల్చివేశారని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే వివేక్ స్వయంగా మాట్లాడిన ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియో సారాంశంలో మత్తడి ధ్వంసానికి కారణమైన కాంగ్రెస్ నేతలను రక్షించే విధంగా ఉందని చెన్నూర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో ఉపయోగించే బాంబుల కారణంగానే పేలుడు జరిగిందని స్పష్టంగా ఎమ్మెల్యే వివేక్ చెపుతుండగా, బాంబులను బయటకు తీసుకొచ్చిన ఆ సింగరేణి ఉద్యోగి ఎవరనేది తేల్చాల్సి ఉంది. సింగరేణి నుంచి ఆ బాంబులు ఎలా బయటకు వచ్చాయి? ఎవరు తీసుకొచ్చారు? సింగరేణి సంస్థలోని గనులు, ఓపెన్ కాస్ట్‌లలో ఈ బాంబులను వినియోగిస్తుంటారు. ఈ బాంబులు బయటకు రావడం అంత సులభం కాదు. కానీ.. చెన్నూర్ మత్తడి పేల్చివేతకు అంత సులభంగా తీసుకొచ్చిన ఉద్యోగి ఎవరు? ఈ పేల్చివేతకు ఉపయోగించిన బాంబులను సరఫరా చేసిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాలి. చెరువు బఫర్ జోన్‌లో మట్టిని పోసిన ఒక కాంగ్రెస్ నాయకుడి దగ్గరి బంధువు ఆర్‌కే ఓసీపీలో పని చేస్తున్నట్లు సమాచారం. కాగా.. సింగరేణి బాంబులతోనే మత్తడి పేల్చినట్లు ఎమ్మెల్యే వివేక్ చెపుతుండగా, కాంగ్రెస్ నాయకుడి బంధువు అయిన సింగరేణి ఉద్యోగి ద్వారానే ఈ బాంబులు సరఫరా జరిగినట్లుగా తెలుస్తున్నది. కాగా.. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఈ మత్తడి పేల్చివేత కేసును పోలీసులు ఏ రకంగా క్లోజ్ చేయనున్నారు? బాధ్యులపైన చర్యలు ఉంటవా? ఉండవా? అని తేలాల్సి ఉంది.

### కాంగ్రెస్ నాయకులను తప్పించడం పక్కానా?

శనగకుంట మత్తడి పేల్చివేత వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులను తప్పించేందుకు అధికార పార్టీ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఈ వ్యవహారంలో నలుగురిని పోలీసులు అరెస్టు చేయగా.. ఇందులో చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్ భర్తతోపాటు మరో ముగ్గురిని అరెస్టు చూపారు. శనగకుంట బఫర్ జోన్‌లో మట్టి పోయడంతోనే చెరువు నీరు తమ కాలనీలోకి రావడం వల్లే పేల్చినట్లు పోలీసులు చెప్పగా.. కేసు విచారణలో కీలక వ్యక్తులను పోలీసులు పక్కన పెట్టినట్లు సమాచారం. చెరువు బఫర్ జోన్‌లో మట్టిపోసినట్లయితే లబ్ధి పొందేది కాంగ్రెస్ నేత అయిన బాపురెడ్డి కాగా కీలక కాంగ్రెస్ నేతలు ఈ వ్యవహారాన్ని నడిపించినట్లు మంచిర్యాల జిల్లా ప్రజలు గుసగుసలాడుతున్నారు. కాగా.. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ విడుదల చేసిన వీడియోలో ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న ఇతర పార్టీ నేతలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించడంపై పలు అనుమానాలు వెలువడుతున్నాయి. మత్తడి పేల్చివేతలో ప్రధానంగా లబ్ధిపొందే నేతలు ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఎమ్మెల్యేకు తెలిసినా ఇతర పార్టీ నేతలను పట్టించి చేతులు దులుపుకునే పరిస్థితి చేస్తున్నట్లు చెన్నూర్ ప్రజలు గుసగుసలు పెట్టుకుంటున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే చెప్పినట్లు 24 గంటలలోగా ఈ కేసును ముగించినట్లయితే మత్తడి పేల్చివేత వ్యవహారం పక్కదారి పట్టే అవకాశం కనిపిస్తున్నది. కాంగ్రెస్ నాయకులను క్లీన్‌చీట్ ఇచ్చి, ఇతర పార్టీ నాయకులను బలిచేయడానికే ఎమ్మెల్యే వివేక్ తన వీడియో ఎక్కడ కూడా సొంత పార్టీ నాయకులకు సంబంధం ఉంది అని చెప్పలేదని స్పష్టం అవుతుంది. ఇటీవల చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ పర్యటించినప్పటికి మత్తడి పేల్చివేతకు కారణమనే టాక్ వినిపిస్తున్న నేతలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కాగా.. వీరి అలకకు దిగి వచ్చి ఎమ్మెల్యే వివేక్ సొంత పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ఈ వీడియో విడుదల చేసి హడావుడిగా కేసు ముగించనున్నారా? అని పలు ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### రిలయన్స్ మార్ట్, ట్రెండ్స్‌కు తాళం వేసిన పోలీసులు

శనగకుంట మత్తడి పేల్చివేత కేసు నేపథ్యంలో చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్‌కు చెందిన భవనంలో రిలయన్స్ మార్ట్, ట్రెండ్స్ కొనసాగుతున్నాయి. ఆ భవనాలకు చెన్నూర్ పోలీసులు తాళం వేశారు. కాగా.. పోలీసులు మాల్స్‌కు తాళం వేయగా చెన్నూర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకున్నది. తప్పుచేసినట్లు రుజువయితే అరెస్టులు చేయకుండా ఇలా షాప్స్‌కు తాళాలు వేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న చెన్నూర్‌లో వరుసగా జరుగుతున్న ఘటనలతో పట్టణ ప్రజలలో అభద్రతా భావం నెలకొంటుంది. కొంతమంది నాయకులు కావాలనే ప్రశాంత వాతావరణం చెడగొట్టేందుకు కొంత కాలంగా కుట్రలు చేస్తున్నట్లుగా సమాచారం. ఈ కేసు విషయంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కలుగజేసుకుని హడావుడిగా కేసుకు ముగింపు పలకకుండా కేసుపై సమగ్ర దర్యాప్తు జరిపి, కాల్ డాటా ఆధారంగా విచారణ జరిపి మత్తడి పేల్చివేతకు కారణమైన ప్రధాన దోషులను పట్టుకోవాలని చెన్నూర్ ప్రజలు కోరుతున్నారు.

# నేటి నుంచి దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- మండపాల్లో ఏర్పాట్లు పూర్తి

చెన్నూర్ టౌన్/మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 2 : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అన్ని మండలాల్లోని దుర్గాదేవి ఆలయాలు, మండపాల్లో నిర్వాహకులు, భక్తులు ఏర్పాట్లు చేశారు. విజయదశమికి ముందు నవరాత్రుల్లో తొమ్మిది రోజుల్లో అమ్మవారిని తొమ్మిది రూపాల్లో పూజిస్తాం. ప్రతి అవతారానికీ ఒక అర్థం ఉంది. ప్రతిదేవి పూజ వెనుక ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. స్వస్తి శ్రీ క్రోధినామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మూడో తేదీన గురువారం నుంచి 12వ తేదీ శనివారం విజయదశమి వరకు వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం మండపాలను ఏర్పాటు చేసి, ఆలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో నిర్వాహకులు అలంకరించారు.

### తొమ్మిది రోజులు.. తొమ్మిది రూపాలు

మొదటి రోజు గురువారం అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిస్తుంది. ఈ సందర్భంగా శాంతిపాఠం, దీపారాధన, నవరాత్రోత్సవ సంకల్పంతో పలు విధాలా పూజలందుకుంటుంది. సాయంత్రం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. రెండో రోజు శుక్రవారం గాయత్రీ దేవి అవతారంలో, మూడో రోజు అన్నపూర్ణాదేవిగా, నాలుగో రోజు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవిగా, ఐదోరోజు లలితా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమివ్వనున్నారు. ఆరో రోజు మహాలక్ష్మీదేవి అవతారంలో, ఏడో రోజు సరస్వతీ దేవి అవతారంలో, ఎనిమిదో రోజు కనకదుర్గాదేవి, తొమ్మిదో రోజు మహిషాసుర మర్దని దేవి అవతారంలో దర్శనమిస్తుంది. పదో రోజు రాజరాజేశ్వరీ దేవి అవతారంలో దర్శనమిస్తుంది. అదే రోజు సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర ఉంటుంది.



మంచిర్యాలలో ముస్తాబైన అమ్మవారి మండపం



మంచిర్యాల రెడ్డి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నెన్నెలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## కనుల పండువగా ఎంగిలిపూల బతుకమ్మ

**ఆడి పాడిన ఆడబిడ్డలు**

*తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు బుధవారం మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అన్ని మండలాల్లో ఎంగిలిపూల వేడుకతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో ఆడబిడ్డలు బతుకమ్మలను పేర్చారు. వాకిళ్లు, ఆలయాలు, ప్రధాన కుడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ కోలాటాలు ఆడారు. అనంతరం బతుకమ్మలను నీటి కొలనులు, పెద్దచెరువుల్లో నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.*

*- నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 2*






నవ దుర్గాదేవి వేషధారణలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



ఆసిఫాబాద్ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

# మహాత్ముడు చూపిన బాటలో నడవాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా గాంధీ జయంతి



మంచిర్యాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్, అక్టోబర్ 2 : మహాత్మా మోహన్ దాస్ కరంచంద్ గాంధీజీ చూపిన శాంతి, సత్యం, అహింసా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అహింస, శాంతి మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు మహాత్మాగాంధీ కృషి చేశారని కొనియాడారు. పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలని ఆయన చెప్పిన మాటలను ఆచరిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వివిధ పార్టీల ఆధ్వర్యంలో..

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 2 : జిల్లా కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మంచిర్యాల మార్కెట్లో గాంధీ పార్క్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### గాంధీజీ పోరాటం స్ఫూర్తిదాయకం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 2 : భారత దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గాన్ని అనుసరించిన మహాత్మా గాంధీజీ చేసిన పోరాటం ఎందరో ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని కుమ్రం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా అధికారులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో శాంతియుతమార్గాన్ని అనుసరించి అనేక పోరాటాలు చేశారని, దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఎందరో నాయకులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.




గాంధీజీకి నివాళులర్పిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

## పెద్దాసుపత్రిలో మందులు లేవట..!

మెడికల్ షాపులో తెచ్చుకోవాలని ప్రభుత్వ దవాఖానలో రాసి ఇచ్చిన మందుల చీటి ➤



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 2: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో మందులు లేక ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ మండలానికి చెందిన శర్మ అనే యువకుడు చికిత్స కోసం వచ్చాడు. మందుల కోసం 3 రోజులుగా తిరుగుతున్నప్పటికీ ఇక్కడ మందులు లేవని, బయట మెడికల్ షాపులో తెచ్చుకోవాలని వైద్య సిబ్బంది చెబుతున్నారని తెలిపాడు. ఎప్పుడు వస్తాయని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని వాపోయాడు. ఈ విషయంపై దవాఖాన సూపరింటెండెంట్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.